షాపులు ఫుల్.. ఆదాయం నిల్

- అరకొర ఆదాయంతో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు
- ఆదాయం పెంపుపై మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం



అంతంత మాత్రంగా ఆదాయం వస్తున్న మున్సిపాలిటీ ప్రధాన అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

నరసాపురం: ఆదాయం ఉంటేనే ఏ సంస్థ అయినా, వ్యవస్థ అయినా మనుగడ సాధిస్తుంది. అయితే నరసాపురం మున్సిపాలిటీలో మాత్రం ఈ పరిస్థితి కనిపించడం లేదు. ఆదాయ మార్గాలు పెంచుకునే అంశంలో నరసాపురం మున్సిపాలిటీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో మున్సిపాలిటీకి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిస్థితిని గమనిస్తే, ఈ విమర్శల్లో పూర్తి నిజాలు ఉన్నాయన్న సంగతి తేటతెల్లమవుతుంది. మునిసిపల్ కాంప్లెక్స్‌లు అరకొర ఆదాయంతో కొట్టిమిట్టాడుతున్నాయి. పట్టణంలో మొత్తం 14 మునిసిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మున్సిపాలిటీకి కేవలం నెలకు రూ.2.98 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాంప్లెక్స్‌లో కూడా షాపులు భర్తీకాని పరిస్థితి ఉందంటే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా లీజులు

ఇక షాపుల లీజుల విషయంలో కూడా అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారులతో లాలూచీ పడడంతో అద్దెలు ఏళ్ల తరబడి పెరగడం లేదు. దీర్ఘకాలం పాటూ తరతరాలుగా ఒకరే పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లిస్తుండడం గమనార్హం. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి ఎప్పుడూ చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. ఇక ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికాబద్ధంగా, వ్యాపారాలకు అనువుగా లేకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ జరగడం లేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇక పాత శిథిలమైన కాంప్లెక్స్‌లను కొత్తగా నిర్మించే విషయంలో కూడా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అల్లూరి కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను పడగొట్టి కొత్త కాంప్లెక్స్ నిర్మించారు. అయితే ఈ కాంప్లెక్స్ ద్వారా కూడా మున్సిపాలిటీకి అనుకున్నంతమేర ఆదాయం రావడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ షాపుల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకుని ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

"ఆదాయం గతంతో పోలిస్తే పెరిగింది



మున్సిపల్ ఆదాయం గతంతో పోలిస్తే బాగా పెరిగింది. ఖాళీగా ఉన్న షాపులను చాలా వరకూ భర్తీ చేశాం. ఆదాయం పెంపునకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం. అల్లూరి కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలి. గతంలో కాంప్లెక్స్‌ను అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధి చేయడానికి చేసిన ప్రయత్నాలను అప్పటి ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

దైవ చింతనతో ఉండాలి



చర్చి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మండలంలోని ఎల్బీచర్ల గ్రామం బైనపాలెంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చిను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మోషేన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు తదితరులు మాట్లాడుతూ అందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

మూడు బుట్టల్లో చెత్తను సేకరించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు బుట్టల్లో వేర్వేరుగా భద్రపరిచి ప్రజలు మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. బుధవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి చెత్తసేకరణను పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో దగ్గర ఉండి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త సేకరణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కాజ హైస్కూల్‌కి ఫర్నీచర్ అందజేత



కాజ హైస్కూల్‌కు ఫర్నీచర్ అందజేస్తున్న పూలపల్లి సంధ్యా మెరైన్ కంపెనీ ప్రతినిధులు

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు గ్రామంలో ఉన్న పింగళి వెంకయ్య ఓరియంటల్ హైస్కూల్‌కు బుధవారం పూలపల్లి సంధ్యా మెరైన్ కంపెనీ ప్రతినిధులు ఫర్నీచర్ అందజేశారు. వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు ప్రోత్సాహంతో మెరైన్ కంపెనీ ఎండీ కె.ఆనంద్ రూ.50 వేలు విలువ చేసే రెండు ఐరన్ బీరువాలు, 8 ఐరన్ కుర్చీలు అందించారు. వాటిని కంపెనీ హెచ్ఆర్ పి.ఏడుకొండలు స్కూల్‌కు వచ్చి హెచ్ఎం మహ్మద్ లియాకత్ అలీకి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం అలీ, ఉపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవ పూజలు



మేడపాడు కాలనీలో రామాలయం వద్ద భక్తుల రద్దీ

యలమంచిలి: మండలంలోని మేడపాడు కాలనీలో ఉన్న రామాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు చింతలపూడి సూరిబాబు, పసుపులేటి సుబ్రహ్మణ్యం, కామిశెట్టి శ్రీనివాస్, గంటా సూరిబాబు, వినుకొండ శ్రీనివాస్, కొప్పిశెట్టి నాగరాజు తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెవెన్యూ అధికారుల తనిఖీలు



స్టాక్ నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొగల్తూరు మండలం మొగల్తూరులోని రైస్‌మిల్లు, గ్యాస్ ఏజెన్సీ, రేషన్ షాపులు, డోర్‌డెలివరీ వాహనాలను బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ కె.రాజకిషోర్, డిప్యూటీ తహసీల్దార్ సుగుణ సంధ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో స్టాక్ నిల్వలు, తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వీరి వెంట వీఆర్ఓ దూసనపూడి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చికెన్ అమ్మకాలు వద్దంటూ ప్రచారం



సిద్ధాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఉభయ గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో కోడి మాంసం అమ్మవద్దంటూ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సిద్ధాంతం పంచాయతీ పరిధిలో కోడి మాంసం, కోడిగుడ్లు అమ్మేవారు వైరస్ తగ్గే వరకూ అమ్మకాలు చేయవద్దంటూ మైక్ ప్రచారం నిర్వహించారు. అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్, మంచినీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: వేసవికాలం దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో మంచినీరు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సునీల్ బాబు అధ్యక్షతన స్థానిక జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులపై సమీక్ష చేయకూడదని ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు సూచించారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి వ్యక్తిగత కారణాలరీత్యా సమావేశానికి హాజరుకాలేక పోయారు. దీంతో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ ప్రతిపక్ష నాయకుడు శాగ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ దోమల బెడద ఎక్కువగా ఉందని, దీనిపై అందరు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కోళ్లకు కొత్తగా బర్డ్‌ఫ్లూ వైరస్ వస్తున్నందున గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు దీనిపై స్పందించి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అన్ని గ్రామాల్లో దోమల నివారణ డ్రైడే నిర్వహిస్తున్నామని, అలాగే ఎబేట్ దోమల మందు స్ప్రే చేయిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో కొంత కాలం పాటు చికెన్ తినడం మానేయాలని ప్రజలకు సూచించారు. వెటర్నరీ డా. వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోళ్లు సాధారణ వ్యాధులతో చనిపోతే గుంతలు తీసి పూడ్చిపెట్టాలని సూచించారు. బర్డ్‌ఫ్లూ వైరస్ సూచనలు లేవని, కొన్ని షెడ్లు తనిఖీ చేశానని, అలాగే శ్యాంపిల్స్ కూడా సేకరించి పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో బర్డ్ ఫ్లూ లేదని నిర్ధారణ జరిగిందని వివరణ ఇచ్చారు.

రైతులు కొబ్బరి పల్లాలు తవ్వించుకోవాలి

జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులు కొబ్బరి తోటల్లో కొబ్బరి చెట్ల చుట్టూ పల్లాలు తవ్వించుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి 25 ఎకరాలకు తగ్గకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి చెట్టుకీ రూ.120 ఉపాధి కూలీకి చెల్లిస్తారన్నారు. దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి సాయిబాబా, గెడ్డం కుటుంబరావు, సర్పంచ్‌లు కడలి నాగమణి, కందుల వెంకటేశ్వరరావు, పంచదా వీర వెంకట నారాయణస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై దాడులు..గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ అధికారులు

నరసాపురం: సబ్సిడీపై గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించారు. లక్ష్మీ అన్నపూర్ణ రెస్టారెంట్‌లో 3 హెచ్‌పీ కంపెనీకి చెందిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, స్వాదిష్ట రెస్టారెంట్‌లో భారత్ గ్యాస్ కంపెనీకి చెందిన 3 సిలిండర్లు స్వాధీనం చేసుకుని, రెస్టారెంట్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గృహవినియోగదారులకు సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాణిజ్య అవసరాలకు ఉపయోగించకూడదన్నారు. ఆమె వెంట సివిల్ సప్లయిస్ డీటీ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ ఉన్నారు.

నేటి నుంచి దాసాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



శ్రీదాసాంజనేయ స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేట బల్లవంతెన వద్ద దాతలు, ప్రజల సహకారంతో నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల నూతన ఆలయంలోని విగ్రహాలను ఈ నెల 15న ప్రతిష్ఠించనున్నారు. గ్రామంలో బల్లవంతెన వద్ద ఆలయం జీర్ణోద్ధరణకు చేరుకుంది. దీంతో గత మూడేళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10లక్షలు మంజూరు చేసింది. దీంట్లో ఇప్పటి వరకు రూ.5లక్షల నిధులు మాత్రమే విడుదలైనట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 13న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభంకానున్నాయి. శివదేవునిచిక్కాల గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి శివరామశర్మ (శివాజీ) 9 మంది వేద పండితుల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించనున్నారు. 15న విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశరస్వామి వార్ల దివ్య కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

గ్రామాల్లో తొలగని ఫ్లెక్సీలు

ఎన్నికల నిబంధనలకు తూట్లు



పాలకొల్లు మండలం గవరపేటలో తొలగించని మంత్రి నిమ్మల రామానాయుడు ఫ్లెక్సీ

పాలకొల్లు అర్బన్: ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలు లో ఉంది. అయితే కొంత మంది అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగించడానికి మొహమాట పడుతున్నారు. మండలంలోని గవరపేటలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి, అలాగే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాలకు ముసుగు వేశారు. కానీ గవరపేట మెయిన్‌రోడ్డులో సర్పంచ్ పొలిమేర వెంకటేశ్వరరావు ఇంటి పక్కన మెయిన్‌రోడ్డు మీద బహిరంగంగా మంత్రి నిమ్మల రామానాయుడుకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామంలోని యువత ఫొటోలతో కట్టిన ఫ్లెక్సీ తొలగించలేదు. అలాగే ఆ గ్రామంలో మరికొన్ని కూటమి పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించలేదు.

జగనన్న కాలనీలో తహసీల్దార్ తనిఖీలు



లబ్ధిదారుల ఇళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆకివీడు: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకుని ఉండకపోతే పట్టాలిచ్చేయాలని, అయితే పట్టా అమ్ముకున్నా, కట్టుకున్న ఇల్లు అద్దెకు ఇచ్చినా స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ ఎన్. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలోని లబ్ధిదారుల ఇళ్లను, ఖాళీ స్థలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో ఎవరు ఉంటున్నారు? అద్దెకు ఉంటున్నారా? సొంతంగా ఉంటున్నారా? పట్టా మీదేనా? లేక కొనుగోలు చేశారా? అంటూ ఆరా తీశారు. రికార్డుల ప్రకారం ఇళ్లలో ఎవరు ఉంటున్నారో? ఆధార్, రేషన్ కార్డులను తనిఖీ చేశారు. తనిఖీలో కొంతమంది తాపీ మేస్త్రీలు, టీడీపీ నాయకులు ఒకొక్కరూ నాలుగైదు ప్లాటులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదులు చేశారు.

రైతులకు యూనిక్ ఐడీపై అవగాహన



ఆచంటలో యూనిక్ ఐడీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాశాఖాధికారులు

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు నేరుగా అందించడానికి రైతులకు యూనిక్ ఐడీపై అవగాహన కల్పించినట్లు ఆచంట మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. బుధవారం ఆచంట రైతు సేవా కేంద్రం రైతుల వివరాలు నమోదు చేసి, యూనిక్ ఐడీపై అవగాహన కల్పించారు. యూనిక్ ఐడీ ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు పంటల భీమా, పీఎం కిసాన్ యోజన , పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీ లభిస్తుందని వివరించారు. ప్రతి రైతూ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్, ఆధార్‌కు లింకైన ఫోన్ నంబరు వివరాలు తీసుకొని రైతు సేవా కేంద్రానికి వస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. రైతులు ఎలాంటి అనుమానాలు చెందకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

పెరిగిన సోలార్ విద్యుత్ వినియోగం



కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలో సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరా

ఆకివీడు: సోలార్ విద్యుత్ వినియోగం ఇటీవల కాలంలో పెరిగింది. సోలార్ విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వడంతో వివిధ యంత్రాల వినియోగానికి సోలర్ ప్యానెల్స్‌ను వినియోగిస్తున్నారు. వనరుల మీద నమ్మకంతో కాలుష్యాన్ని తగ్గించేందుకు, ముడి చమురును ఆదా చేసేందుకు, ఇంధనాల వాడకాన్ని తగ్గించేందుకు సోలార్ ప్యానల్స్ వినియోగం పెరిగింది. దీనిని వాడడం వల్ల ఇంధనం ధర తగ్గుతోంది. మండలంలోని కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలోని ఆలయం వద్ద సెక్యూరిటీకి సోలార్ ప్యానల్‌తో పనిచేసే సీసీ కెమెరాను అమర్చారు. ఆ ప్రాంతంలో మద్యం తాగడం, దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాను స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సోలార్ వినియోగం పెరుగుతుంది. వ్యవసాయ పంపుసెట్లు, గ్రైండర్లు, మిక్సీలు వంటి వాటికి కూడా సోలార్ ప్యానల్స్ వినియోగిస్తున్నారు. పలు చోట్ల రొయ్యల చెరువులకు భూగర్భ జలాలను తోడేందుకు, ఏరియేటర్లు తిప్పేందుకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



చాంబర్స్ విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కడుపులో నులిపురుగులు నివారిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా పెరుగుతారని చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ సీతారామరాజు అన్నారు. డిగ్రీ విద్యార్థులకు బుధవారం నులిపురుగు నివారణ మాత్రలు సీతారామరాజు చేతుల మీదుగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రాధ, మాధవి, రాంబాబు, అధ్యాపకులు వర్మ, శేఖర్‌బాబు, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుగొండ: మండలంలోని వడలికి చెందిన ఇద్దరికి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం కొమ్ముచిక్కాలలో నల్లి సత్యనారాయణకు రూ.2,58,822ను, తమ్మిరెడ్డి జయ ప్రకాష్‌కు రూ.45వేల చెక్కును అందించారు. పేద ప్రజల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని పితాని అన్నారు. కార్యక్రమంలో వడలికి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలి

ఉండి: మండల వ్యాప్తంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నతపా ఠశాలల్లో మరో నెల రోజుల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారులు జ్యోతి, వినాయకుడితో ఎంపీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి హైస్కూల్ పరిధిలో పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని తెలిపారు. అలాగే పరీక్షలు కట్టుదిట్టంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

మందాలమ్మకు వెండి సమర్పణ



వడలి గ్రామ దేవత మందాలమ్మకు వెండి సమర్పిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ వారికి వెండి కవచం తయారీకి దాతలు వెండిని సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో చప్పా రామస్వామి కుమార్తె కైకలూరుకు చెందిన వెన్నెల రాంబాబు, శేషురత్నం దంపతుల కుమారులు సాయి పవన్, సాయి హర్ష కుటుంబ సభ్యులు 250 గ్రాముల వెండిని సమర్పించారని వివరించారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్న సమారాధనను నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం: నరసాపురం ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు మండలాల్లోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలు నుంచి 12 గంటలు వరకూ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని చెప్పారు.

నేడు యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యలమంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసనమండలి సభ్యుల ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కోడ్ నిబంధనలను అనుసరించి ఈ సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా పుష్పయాగోత్సవం

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామికి పుష్ప యాగోత్సవ కార్యక్రమాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు పీటలపై కూర్చుని పుష్పయాగోత్సవాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయ ఆవరణలో పల్లకీలో ఊరేగించారు.